ఆస్పత్రి వెనుక గేటు కోసం అడ్డదారి.!

- గెడ్డ ఆక్రమించి ప్రభుత్వ స్థలంలో నిర్మాణం
- వివాదాస్పదంగా శ్రీసత్య ఆస్పత్రి యాజమాన్యం తీరు
- స్థానికులు అడ్డుపడడంతో పనులు నిలిపివేత



హెల్త్‌సిటీలో శ్రీసత్య ఆస్పత్రి వెనక భాగంలో గెడ్డలో గోడ నిర్మాణం కోసం వేసిన కాంక్రీట్

ఆరిలోవ: స్థానిక హెల్త్ సిటీలో చేపట్టిన పలు ఆస్పత్రుల నిర్మాణాలు వివాదాస్పదంగా మారుతున్నాయి. కొందరు స్థలాలు తీసుకొని కాలం గడుస్తున్నా నిర్మాణాలు చేపట్టలేదు. ఇంకొందరు నిబంధనలకు విరుద్ధంగా పనులు సాగిస్తున్నారు. మరి కొందరు మరో అడుగు ముందుకేసి రోడ్డును ఆనుకుని ఉన్న ఖాళీ స్థలాలు, గెడ్డల ఆక్రమణకు సిద్ధమవుతున్నారు. ఇందుకు హెల్త్ సిటీలో శ్రీసత్య ఆస్పత్రి యాజమాన్యం తీరే నిదర్శనం. ఈ ఆస్పత్రి నిర్మాణం ఇటీవలే పూర్తయింది. కొద్ది రోజులగా ఇక్కడ వైద్య సేవలు కూడా అందుతున్నాయి. అంత వరకు బాగానే ఉంది. అయితే ఈ ఆస్పత్రి హెల్త్ సిటీ లేఅవుట్‌లో చివరన ఆరిలోవ ప్రాంతం నలబై గజాల కాలనీ మీదుగా శ్రీకాంత్‌నగర్ డబుల్ రోడ్డును ఆనుకుని ఉంది. ఈ రోడ్డుకు ఆస్పత్రి వెనుక భాగానికి మధ్యలో ప్రభుత్వానికి చెందిన ఖాళీ స్థలం, గెడ్డ ఉన్నాయి. ఆ ఖాళీ స్థలాన్ని కాజేయడానికి గెడ్డ భాగాన్ని కూడా గతంలోనే పూడ్చేశారు. ఇప్పుడు ఆస్పత్రి వెనుక భాగంలో ఉన్న ప్రభుత్వానికి చెందిన ఖాళీ స్థలం చదును చేసి గేటు ఏర్పాటుకు పూనుకున్నారు. ఇందు కోసం గెడ్డలో గోడ నిర్మాణం చేపట్టారు. ఇందులో భాగంగా గెడ్డలో కాంక్రీట్ వేసి ఇనుప రాడ్లు అమర్చారు. ఈ పనులన్నీ రాత్రి పూటే చేపట్టడం గమనార్హం. నలబై గజాల రోడ్డు వైపు అక్రమంగా ఆస్పత్రి గేటు ఏర్పాటు చేస్తున్న విషయం స్థానికులు తెలుసుకుని మంగళవారం ఆస్పత్రి నిర్వాహకులను నిలదీశారు. దీంతో పనులు నిలిచిపోయాయి. ఆ పనులు పూర్తి చేయడానికి అధికారులు, రాజకీయ నాయకుల చుట్టూ తిరుగుతూ విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. వాస్తవానికి హెల్త్‌సిటీలో లోపల రోడ్డు వైపే గేట్లు ఏర్పాటు చేసుకోవాలి. అన్ని ఆస్పత్రులు అదే మాదిరిగా గేట్లు ఏర్పాటు చేసుకున్నాయి. కానీ శ్రీసత్య ఆస్పత్రి నిర్వాహకులు మాత్రం గెడ్డను పూడ్చేసి ప్రత్యేకంగా ఆరిలోవ కాలనీ వైపు అనధికారికంగా అదనంగా మరో గేటు ఏర్పాటు చేస్తుండడం వివాదాస్పదంగా మారింది. ఇక్కడ ఖాళీ స్థలంతో పాటు గెడ్డ ఆక్రమించి నిర్మాణం జరుగుతున్నా జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు, రూరల్ రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడంపై స్థానికుల నుంచి పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఇదిలా ఉండగా ఈ ఆస్పత్రి నిర్మాణానికి ఎదురుగా సుమారు 100 మీటర్ల దూరంలోనే వార్డు సచివాలయం ఉంది. టౌన్ ప్లానింగ్, రెవెన్యూ సిబ్బంది నిత్యం ఇక్కడే ఉంటారు. అయినా ఈ గేటు నిర్మాణ విషయంలో చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. కాలనీ వైపు దారి ఏర్పాటు చేసిన గేటు అమర్చితే అంబులెన్స్‌లు, రోగులతో ఇబ్బందిపడతామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గెడ్డలో గేటు నిర్మాణం నిలిపివేయాలని కోరుతున్నారు.

తహసీల్దారు దృష్టికి తీసుకెళ్తాం..

శ్రీసత్య ఆస్పత్రి వ్యవహారం మా దృష్టికి రాలేదు. గెడ్డలో ఎలాంటి నిర్మాణం చేపట్టకూడదు. హెల్త్ సిటీలో ఆరిలోవ కాలనీ వైపు ప్రత్యేకంగా గేట్లు ఏర్పాటు చేయకూడదు. ఈ గేటు నిర్మాణాన్ని పరిశీలించి తహసీల్దారు దృష్టికి తీసుకెళ్తాం.

– సత్యం దొర, వీఆర్‌వో

క్లుప్తంగా

ఏపీ జీసీజీటీఏ డైరీ ఆవిష్కరణ



డైరీని ఆవిష్కరిస్తున్న కృష్ణా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయబాబు, తదితరులు

మద్దిలపాలెం: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల గెజిటెడ్ అధ్యాపకుల సంఘం(ఏపీ జీసీజీటీఏ) డైరీని మద్దిలపాలెంలోని డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో బుధవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయబాబు, సంఘం జిల్లా అధ్యక్షుడు చీడి విష్ణుమూర్తి, కార్యదర్శి పి.గోపాల్‌నాయుడు, జోనల్ కార్యదర్శి జి.లక్ష్మణరావు, జోనల్ మహిళా కార్యదర్శి సిహెచ్.ఎస్.అనురాధ, అధ్యాపకులు పాల్గొన్నారు.

యూఎన్‌ఐడీవో నిపుణుల కమిటీ సభ్యునిగా పురుషోత్తం

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం డీపీఐఐటీ–ఐపీఆర్ చైర్ ప్రొఫెసర్ డాక్టర్ హెచ్.పురుషోత్తం యునైటెడ్ నేషన్స్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్(యూఎన్‌ఐడీవో) కమిటీ సభ్యునిగా నియమితులయ్యారు. ముగ్గురు సభ్యుల బృందంలో ఒక్కడిగా డాక్టర్ పురుషోత్తం ఎన్నికయ్యారు. లో కార్బన్ టెక్నాలజీస్, లో కార్బన్ డిప్లాయిమెంట్ అంశంపై నిర్వహించే ఇన్నోవేషన్ చాలెంజ్ ప్రపోజల్స్‌ను పరిశీలించి, నిర్ధారించే కమిటీలో సభ్యునిగా పురుషోత్తం నియమితులయ్యారు. స్టోరేజ్ సొల్యూషన్స్, బ్యాటరీ టెక్నాలజీస్ అంశాలపై పనిచేసే ఇన్నోవేటర్స్‌కు 50 వేల అమెరికన్ డాలర్లు ఇన్వెస్టర్ అందిస్తారు.

ప్రైవేటీకరణపై సీపీఎం నిరసన



ఆరిలోవలో ర్యాలీ చేస్తున్న సీపీఎం నాయకులు

ఆరిలోవ: ముడసర్లోవ భూముల ప్రైవేటీకరణను జీవీఎంసీ అధికారులు వెంటనే నిలిపివేయాలని సీపీఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు డిమాండ్ చేశారు. సీపీఎం ఆరిలోవ జోన్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఆరిలోవలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 1న జీవీఎంసీ కౌన్సిల్‌లో జరిగిన సమావేశంలో 283 ఎకరాల ముడసర్లోవ భూములను పీపీపీ పద్ధతిలో అప్పగించడానికి ఆమోదం తెలిపిందన్నారు. కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టడానికి ఈ ప్రయత్నం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఈ తీర్మానాన్ని రద్దుచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఆర్.కె.ఎస్.వి.కుమార్, శంకరరావు, సత్యనారాయణ, రంగమ్మ, రమణ, నరేంద్రకుమార్, ఆదినారాయణ, నాగరాజు, రమణమ్మ పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌కు సాయం అందించాలని వినతి



కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియాకు వినతిపత్రం అందిస్తున్న ఎంపీ జీవీఎల్

ఎంవీపీ కాలనీ: విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు తక్షణ ఆర్థిక సాయం కోరుతూ కేంద్ర ఉక్కుశాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియాకు రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు వినతిపత్రం అందజేశారు. ఉక్కు మంత్రిత్వశాఖ కార్యదర్శి నాగేంద్రనాథ్ సిన్హాకు కూడా ఢిల్లీలోని ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేసినట్లు జీవీఎల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతికూల పరిస్థితులు కారణంగా విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు తక్కువ ఉత్పాదకత పరిస్థితి ఎదురవుతుందన్నారు. స్టీల్‌ప్లాంట్ ఎదుర్కొంటున్న వర్కింగ్ క్యాపిటల్ సమస్యతో పాటు ప్రతికూల మార్కెట్ పరిస్థితులు, సొంత గనులు లేకపోవడం వంటి సమస్యలను ఆయన మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఆర్‌ఐఎన్‌ఎల్‌ను లాభాల్లోకి తీసుకొచ్చేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరినట్లు ఎంపీ తెలిపారు.

సమష్టిగా పరిశుభ్రతకు కృషి



ప్రసంగిస్తున్న ప్రిన్సిపాల్ నరసింహారావు

ఏయూ క్యాంపస్: అందరూ సమష్టిగా పరిశుభ్రతకు కృషి చేయాలని ఏయూ ఆర్ట్స్, కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు కోరారు. బుధవారం నరవలోని జామియా ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో ఏయూ సెంటర్ ఫర్ సోషల్ ఎక్స్‌క్లూజన్, ఇంక్లూజివ్ పాలసీ విభాగం నిర్వహించిన 'ఎండింగ్ ఓపెన్ డెఫికేషన్ టువర్డ్స్ ప్రమోటింగ్ హైజీన్ అండ్ పబ్లిక్ హెల్త్'సదస్సును ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మరుగుదొడ్లు వినియోగించాలన్నారు. కేంద్రం సంచాలకుడు డాక్టర్ పి.సుబ్బారావు మాట్లాడుతూ ప్రజలను చైతన్యవంతం చేసే దిశగా వర్సిటీ పరంగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఆంధ్రా మెడికల్ కళాశాల కమ్యూనిటీ మెడిసిన్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బి.నాగేంద్రనాయుడు మాట్లాడుతూ సంప్రదాయ అడ్డుగోడలు తొలగించి పరిశుభ్రత, ఆరోగ్య భద్రత దిశగా అడుగేయాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సిహెచ్.వరప్రసాద్, శానిటేషన్ సెక్రటరీ డాక్టర్ జి.జగన్నాథరావు, జామియా ఎడ్యుకేషనల్ ట్రస్ట్ కరస్పాండెంట్ షేక్ రహమాన్, డాక్టర్ జి.శాంతారావు, చుక్క క్రిష్టోఫర్, జోసఫ్ రాజు, టి.బుజ్జి పాల్గొన్నారు.

గురుకులంలో ప్రత్యేక ఆధార్ కేంద్రం



గురుకులంలో విద్యార్థులకు ఆధార్ నమోదు చేస్తున్న సిబ్బంది

ఆరిలోవ: శ్రీకృష్ణాపురంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకులంలో ఇంటర్మీడియట్ విద్యార్థుల కోసం ప్రత్యేక ఆధార్ కేంద్రం ఏర్పాటు చేశారు. కొత్తగా ఆధార్ నమోదుతో పాటు తప్పుల సవరణ, పేర్లు, చిరునామాలో మార్పులకు అవకాశం కల్పించినట్టు గురుకులం వైస్ ప్రిన్సిపాల్ బి.రామకృష్ణ బుధవారం తెలిపారు. ఇప్పటి వరకు 80 మందికి ఆధార్ నమోదు చేశామన్నారు.

పురాణ ఇతిహాసాలు మానవాళికి మార్గదర్శకాలు



కార్యక్రమంలో పాల్గొన్న శ్రీశంకర విజయేంద్ర సరస్వతి, సామవేదం షణ్ముఖశర్మ

ఎంవీపీ కాలనీ: పురాణ ఇతిహాసాలు మానవాళి జీవనానికి మార్గదర్శకాలని కంచికామకోటి పీఠాధిపతి శ్రీశంకర విజయేంద్ర సరస్వతి అన్నారు. బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మతో కలిసి ఆయన బుధవారం శ్రీసౌందర్యలహరి ప్రవచన మహోత్సవాల్లో పాల్గొన్నారు. ఎంవీపీ కాలనీ సెక్టార్–6లోని ఏబీసీ పార్కులో శ్రీశక్తి పంచాయతన యోగ పూర్వక శ్రీ సౌందర్యలహరి ప్రవచన మహోత్సవాలు కొద్ది రోజులుగా జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా శ్రీశంకర విజయేంద్ర సరస్వతి మాట్లాడుతూ సనాతన పురాణాలు, ఇతిహాసాలు, ఉపనిషత్తుల్లో విశేషమైన విజ్ఞానం దాగి ఉందన్నారు. ఈ విజ్ఞానం మానవ మనుగడ, జీవన విధానానికి మార్గనిర్దేశంగా నిలుస్తుందన్నారు. సనాతన ధర్మాలపై ప్రజలను చైతన్యం చేసేందుకు షణ్ముఖశర్మ చేస్తున్న కృషిని అభినందించారు. అనంతరం షణ్ముఖశర్మ ప్రవచనాలను ఆయన ఆసక్తిగా తిలకించారు. కేవీఎస్ శ్యామ్, అరుణగాయత్రి, నిర్వాహకులు వీవీ ఆదినారాయణ, దొంతకుర్తి శ్రీనివాస్ పాల్గొన్నారు. 108 మంది దంపతులు సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం చేశారు.

యూనియన్ బ్యాంకులో రుణ మేళా

మద్దిలపాలెం: యూనియన్ బ్యాంకు నిర్వహిస్తున్న రిటైల్ రుణ మేళాను సద్వినియోగం చేసుకోవాలని బ్యాంకు పిఠాపురం కాలనీ బ్రాంచి చీఫ్ మేనేజర్ ఉదయ్‌భాస్కర్ తెలిపారు. ఈ మేరకు పిఠాపురం కాలనీ బ్రాంచి బుధవారం జరిగిన కార్యక్రమంలో లబ్ధిదారులకు రుణ మంజూరు పత్రాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గృహ, వాహన, వ్యక్తిగత రుణాలు, విద్యా రుణాలు అందిస్తున్నామన్నారు. బ్రాంచి పరిధిలో 33 మంది లబ్ధిదారులకు సుమారు రూ.10.03 కోట్లు రుణం అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజర్లు సిహెచ్.రమేష్, బిందు, సిబ్బంది పాల్గొన్నారు.

బ్యాటరీతో పనిచేసే కృత్రిమ చేతుల పంపిణీ



లబ్ధిదారుకు అమర్చిన బ్యాటరీ కృత్రిమ చేతిని పరిశీలిస్తున్న మేయర్ హరివెంకట కుమారి

తాటిచెట్లపాలెం: రోటరీక్లబ్ ఆఫ్ విశాఖపట్నం సెంట్రల్, రోటరీ క్లబ్ ఆఫ్ పూనా డౌన్ టౌన్, కరూర్ వైశ్యాబ్యాంక్ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటి సహకారంతో ఇనాలి ఫౌండేషన్ రైల్వే న్యూకాలనీలో గల విశాఖ సేఫ్టీ కౌన్సిల్ కార్యాలయంలో బుధవారం ఉచిత బ్యాటరీతో పనిచేసే కృత్రిమ చేతులను పంపిణీ చేసింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జీవీఎంసీ మేయర్ జి హరివెంకట కుమారి మాట్లాడుతూ పుట్టుకతో అంగవైకల్యం కలిగిన వారికి, మధ్యలో ప్రమాదాలలో చేతులను కోల్పోయిన వారికి కృత్రిమ చేతులను అందించడం అభినందనీయమన్నారు. ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ సి.బాలసతీష్‌ను అభినందించారు. గురువారం విశాఖపట్నం జిల్లా పరిసర ప్రాంతాల వారికి ఈ శిబిరంలో కృత్రిమ చేతులను అమర్చనున్నట్లు బాలసతీష్ తెలిపారు. ఇటువంటి పరికరాన్ని అమర్చేందుకు ఒకొక్కరికి సుమారు రూ. 11వేలు ఖర్చు అవుతుందని, దీనికి సిఎస్ఆర్ నిధులతో కరూర్ వైశ్యా బ్యాంక్ సహకారం అందిస్తుందని తెలిపారు. వీజేఎఫ్ అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు, రోటరీక్లబ్ విశాఖపట్నం సెంట్రల్ అధ్యక్షుడు పి.శ్రీనివాస్, రోటరీ క్లబ్ పూనా డౌన్ టౌన్ నుంచి అనిల్ చద్దా, ఇనాలి ఫౌండేషన్ క్యాంప్ లీడర్ బి.అనికేత్ పాల్గొన్నారు.

అవకాశాలు అందిపుచ్చుకోవాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న విశ్రాంత ఐపీఎస్ అధికారి కోడె దుర్గాప్రసాద్

సీతంపేట: విశ్రాంత ఐపీఎస్ అధికారి, పూర్వ డీజీపీ కోడె దుర్గాప్రసాద్ బుధవారం విశాఖ పౌర గ్రంథాలయాన్ని సందర్శించారు. గ్రంథాలయంలోని వివిధ విభాగాలను పరిశీలించి, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులతో మాట్లాడారు. విద్యార్థులకు, పాఠకులకు చక్కటి వాతావరణం కల్పించారని పౌర గ్రంథాలయ సొసైటీని అభినందించారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి దుర్గాప్రసాద్ మాట్లాడుతూ పోటీ పరీక్షలకు ఎలా సిద్ధం కావాలో మార్గనిర్దేశం చేశారు. దేశంలో విభిన్న రంగాలలో ఉపాధి అవకాశాలు ఉన్నాయని, వాటిని అందిపుచ్చుకోవడానికి ప్రతిభ, కృషి అవసరమని చెప్పారు. పరీక్షలకు వెళ్లే ముందు ఎలాంటి ఆందోళన ఉండకూడదని, ప్రశాంతమైన మనస్సుతో పరీక్ష రాయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.విజయ్‌కుమార్, డి.ఎ.స్.వర్మ, ఆచార్య ఎ.ప్రసన్నకుమార్, పాలక వర్గం సభ్యులు వి.సీతారామయ్య, సహ కార్యదర్శి డి.వి.సూర్యారావు, సిబ్బంది పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో ఎసెంట్ విద్యార్థుల సత్తా



99.85 శాతం పర్సంటైల్ సాధించిన సిహెచ్.కౌశిక్

మద్దిలపాలెం: ఇటీవల విడుదలైన జేఈఈ మెయిన్స్ సెషన్–1 ఫలితాల్లో ఎసెంట్ కళాశాల విద్యార్థులు సత్తా చాటారని కళాశాల డైరెక్టర్ జి.నాగేశ్వరావు తెలిపారు. సిహెచ్.కౌశిక్ 99.85 పర్సంటైల్ సాధించారన్నారు. 99 శాతం 10 మంది, 95 శాతంతో 81 మంది విద్యార్థులు ప్రతిభ కనబరిచారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను బుధవారం అభినందించారు.

నేడు మృత్యుంజయేశ్వర విగ్రహ ప్రతిష్ఠ



పంచామృత అభిషేకంలో పాల్గొన్న భక్తులు

ఏయూ క్యాంపస్: స్థానిక పెదవాల్తేరులోని శ్రీఅసంగానంద ఆశ్రమంలో పునర్నిర్మించిన మృత్యుంజయేశ్వర ఆలయ ప్రారంభోత్సవాలు కొనసాగుతున్నాయి. రెండో రోజు బుధవారం శ్రీశివలింగ నందీశ్వర, ధ్వజ స్తంభ శిఖర కలశ ప్రతిష్ఠా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా మహిళలు సౌభాగ్యలక్ష్మి కుంకుమ పూజ, విగ్రహ మూర్తులకు, ప్రతిష్ఠా యంత్రములకు పంచామృత, క్షీర, ఘృత అధివాస అభిషేకాలు చేశారు. సాయంత్రం ధాన్యాధివాసం, పుష్పాధివాసం, శయ్యాధివాసం, అష్టకలశ స్థాపన జరిపారు. గురువారం ఉదయం 8.47 గంటలకు మృత్యుంజయేశ్వర విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం జగద్గురు మఠం, శ్రీలలితాంబిక పీఠాధిపతి సంపూర్ణానందగిరి స్వామి చేతుల మీదుగా జరగనుంది.

పెన్షనర్స్ హెల్త్ గైడ్ ఆవిష్కరణ



పెన్షనర్స్ హెల్త్‌గైడ్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం పెన్షనర్స్ అసోసియేషన్ తీర్చిదిద్దిన హెల్త్ గైడ్ హ్యాండ్ బుక్‌ని వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి వర్సిటీ సెనేట్ మందిరంలో మంగళవారం ఆవిష్కరించారు. రాష్ట్ర స్థాయిలో పెన్షనర్లకు ఉపయుక్తంగా నిలిచే అంశాలు, హెల్త్ కార్డులతో పొందే సేవలు, ఉద్యోగులకు, పెన్షనర్లకు సులభంగా సమాచారాన్ని అందించేలా ఈ పుస్తకాన్ని తీర్చిదిద్దారు. ఆస్పత్రులు అందించే సేవలు, సమగ్ర వివరాలు, ఫోన్ నంబర్లు వంటివి ఈ పుస్తకంలో పొందుపరిచారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.సమత, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య ఎస్.కిషోర్ బాబు, పెన్షనర్స్ సంఘం అధ్యక్షుడు గొలగాని అప్పారావు, గౌరవ అధ్యక్షుడు టి.సైదయ్య, జనరల్ సెక్రటరీ సి.నాగశేఖరరెడ్డి, ఎగ్జిక్యూటివ్ సభ్యులు, పెన్షనర్లు పాల్గొన్నారు.

వివాదాస్పద స్థలానికి కంచె ఏర్పాటుపై ఫిర్యాదు



కోర్టు కేసులో ఉన్న స్థలానికి వేసిన కంచె

ఆరిలోవ: కోర్టులో కేసు ఉన్న స్థలానికి ఓ వ్యక్తి కంచె ఏర్పాటు చేయడంపై రెవెన్యూ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వీఆర్‌వో సత్యం దొర తెలిపిన వివరాలు ప్రకారం.. రూరల్ మండలంలో ముడసర్లోవ రెవెన్యూ పరిధి పైనాపిల్ కాలనీలో సర్వే నంబరు 20/3లో ప్రభుత్వ పోరంబోకు స్థలం ఉంది. అందులో సుమారు ఎకరం స్థలంలో 2013లో కోన తాతారావు సిమెంట్ స్తంభాలు వేయడానికి ప్రయత్నించారు. అప్పట్లో దాన్ని రెవెన్యూ అధికారులు అడ్డుకోవడంతో ఆ స్థలం తమదేనంటూ ఆయన కోర్టును ఆశ్రయించారు. ప్రస్తుతం ఈ వ్యవహారం కోర్టులో ఉండగా.. ఈ నెల 3న తాతారావు కుటుంబ సభ్యులు ఆ స్థలం చుట్టూ సిమెంట్ స్తంభాలు వేసి కంచె ఏర్పాటుకు పనులు చేపట్టారు. కోర్టులో కేసు ఉండగా.. కంచె ఏర్పాటు చేయడంపై అదే రోజు రూరల్ తహసీల్దారు ఆదేశాలతో తాతారావు కుటుంబ సభ్యులపై ఆరిలోవ పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు వీఆర్‌వో తెలిపారు.

రజకులకు ఆలంబనగా జగనన్న చేదోడు

- ప్రజల ముంగిటకే సంక్షేమం
- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో అక్కరమాని



ప్రజలతో మాట్లాడుతున్న సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల

ఏయూ క్యాంపస్: రజకులకు ఆలంబనగా జగనన్న చేదోడు నిలుస్తోందని వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల అన్నారు. బుధవారం 20వ వార్డు పరిధి చినవాల్తేరు రజకవీధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చేతి వృత్తుల వారికి అండగా నిలుస్తూ, వారికి ఆర్థికంగా భరోసా కల్పించేలా ప్రతి సంవత్సరం రూ.10 వేలు ప్రభుత్వం అందిస్తుందన్నారు. స్థానికంగా ఉన్న ప్రజల ఇళ్లకు వెళ్లి వారికి అందుతున్న సంక్షేమ పథకాలను స్వయంగా వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని చేతల్లో చూపిందని చెప్పారు. ప్రజలతో మమేకమై వారి అవసరాలను అడిగి తెలుసుకున్నారు. 20వ వార్డు కార్పొరేటర్ మువ్వల లక్ష్మి, నాయకులు మువ్వల సురేష్, మద్ది లోపిరెడ్డి, పద్మజ, సుబ్బమ్మ, దిల్ రాజు, సచివాలయం కన్వీనర్ పాపారావు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ముడసర్లోవ గ్యాలరీ పరిశుభ్రం



ముడసర్లోవ గ్యాలరీలో నాచు తొలగిస్తున్న సిబ్బంది

ఆరిలోవ: ముడసర్లోవ పార్కు లోపల ఉన్న నీటి గ్యాలరీని నీటి సరఫరా విభాగం అధికారులు శుభ్రం చేశారు. రిజర్వాయర్‌లోని నీరు వచ్చి నిత్యం ఈ గ్యాలరీలో నిల్వ ఉంటుంది. ఈ నీటిలో ప్రస్తుతం నాచు దట్టంగా పేరుకుపోయింది. దీంతో దుర్వాసన వస్తోంది. ప్రస్తుతం ఆ నాచును తొలగిస్తున్నారు. సాధారణంగా ఆరు నెలలకు ఓసారి ఈ గ్యాలరీని శుభ్రం చేస్తుంటారు. ఇందులో భాగంగా రెండు రోజులుగా శుద్ధి చేసే పనులు చేపట్టారు.

పాలిటెక్నిక్ విద్యార్థులకు విస్తృత అవకాశాలు

- ఉద్యోగాల్లో చేరేందుకు తొలి ప్రాధాన్యం ఇవ్వాలి
- రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ నాగరాణి



ఇన్నోవేషన్ కేంద్రాన్ని ఆవిష్కరిస్తున్న సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ నాగరాణి

మురళీనగర్: పాలిటెక్నిక్ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు పారిశ్రామిక, సాంకేతిక రంగంలో విస్తృతమైన ఉద్యోగావకాశాలు ఉన్నాయని రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ సి.నాగరాణి తెలిపారు. కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో ఏర్పాటు చేసిన పలు సౌకర్యాలను ఆమె బుధవారం ప్రారంభించారు. ప్రిన్సిపాల్ జీవీ సత్యనారాయణమూర్తి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ డిప్లమో కోర్సులు పూర్తి కాగానే ఉద్యోగాల్లో చేరడానికి ప్రాధాన్యతనివ్వాలని సూచించారు. రెండేళ్ల అనుభవం సాధించిన అనంతరం ఉన్నత చదువులు చదువుకోవచ్చని చెప్పారు. ప్రస్తుతం 17 ఏళ్లకే నెలకు రూ.20 వేలు నుంచి రూ.30వేలు జీతం పొందే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. ఇటీవల పాలిటెక్నిక్ కాలేజీ విద్యార్థులు రూ.6.67లక్షల వార్షిక ప్యాకేజీతో ఉద్యోగాలు సాధించిన విషయాన్ని ఆమె గుర్తు చేశారు. సృజనాత్మక ఆలోచనలకు పదును పెట్టాలని, నూతన ఆవిష్కరణలు రూపొందించి పేటెంటు హక్కు పొందేలా విద్యార్థులు కృషి చేయాలన్నారు. ఇటీవల నిర్వహించిన రాష్ట్ర స్థాయి టెక్‌ఫెస్ట్‌లో 833 ప్రాజెక్టులు రాగా.. ఇందులో పేటెంట్ హక్కుల కోసం 13 ప్రాజెక్టులు, ప్రొడక్షన్‌కు 55, ఇంక్యుబేషన్ విభాగానికి 53 ప్రాజెక్టులు ఎంపికయ్యాయని చెప్పారు. విద్యార్థులు కమ్యూనికేషన్ స్కిల్స్‌ను పెంచుకోవాలని సూచించారు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఆంధ్రా యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ విద్యార్థులు స్టూడెంట్ చాప్టర్‌లో తమ పేరు నమోదు చేసుకోవడం ద్వారా కెరీర్‌కు అవసరమైన సహకారం లభిస్తుందన్నారు. ఇందులో వారు పంపించిన ఉత్తమ సృజనాత్మక ఆలోచనలకు పేటెంట్ పొందే అవకాశం ఉందన్నారు. బెస్ట్ ప్రాజెక్టులకు రూ.50 వేలు నగదు బహుమతి లభిస్తుందని తెలిపారు. ముందుగా కాలేజీలో ఏర్పాటు చేసిన డిజిటల్ లైబ్రరీ, ఆధునికీకరించిన కార్యాలయం, ఇన్నోవేషన్ కేంద్రం, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ స్టూడెంట్ చాప్టర్‌ను ప్రారంభించారు. మెటలర్జీ విభాగానికి దాత సమకూర్చిన ప్రయోగశాల పరికరాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ ఎడ్యుకేషన్ టీపీవో విభాగం డీడీ డాక్టర్ ఎంఏవీ రామకృష్ణ, కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ, పెందుర్తి కాలేజీ ఓఎస్‌డీ డాక్టర్ ఎస్.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో కొరియర్ బాయ్‌కు గాయాలు



క్షతగాత్రుడు కిరణ్

మర్రిపాలెం: రోడ్డు ప్రమాదంలో కొరియర్ బాయ్‌కు తీవ్ర గాయాలైన ఘటన బుధవారం కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసు లు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మురళీనగర్‌లోని తెన్నేటినగర్ వద్ద టాటా ఏస్ వ్యాన్ సందులోంచి మలుపు తిరుగుతున్న క్రమంలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న మర్రిపాలేనికి చెందిన బల్లా కిరణ్(19) అనే యువకుడిని ఢీకొంది. దీంతో ఆయన ఎడమ కాలు విరిగిపోయింది. ఈయన అమెజాన్‌లో డెలివరీ బాయ్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఉదయం 9.30 గంటలకు ఈ ప్రాంతంలో వినియోగదారులకు వస్తువులు డెలివరీ చేయడానికి వెళ్తున్న సమయంలో ఈ ఘటన జరిగింది. కిరణ్ తల్లి సత్యవతి ఫిర్యాదు మేరకు కంచరపాలెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు సహస్ర తులసీ దళార్చన

డాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి దేవాలయంలో ప్రతి గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నెంబరు 06081001100 6691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806091లో చెల్లించాలి.